(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY

తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 5 సంచిక : 108 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 16-10 - 2026 పేజీలు : 6



భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్



భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో తొలి దశ పూర్తి

ప్రస్తుతం ఒప్పందం లీగల్ డ్రాఫ్టింగ్ దశలో ఉందన్న కేంద్ర మంత్రి

చర్చలు కొలిక్కి వస్తున్నాయన్న విదేశాంగ మంత్రి జైశంకర్

పోటీ దేశాలపై పైచేయి సాధించడమే లక్ష్యమంటున్న భారత్

భారత్-అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పురోగతి లభించింది.



స్పోర్ట్స్ డెస్క్: ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పతకాలు కేవలం అంకెలకు మాత్రమే పరిమితం కాదని, అది క్రీడా రంగంలో భారత దేశ శక్తికి ప్రతీకని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆసియా క్రీడలు 2026లో పతకాలు సాధించిన అథ్లెట్లను ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో ప్రధాని మోదీ సన్మానించారు. 2లో



రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలుప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్ ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. 2లో



హైదరాబాద్, అక్టోబర్ 15: ప్రపంచాన్ని ఎల్‌నినో విపత్తు వణికిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్‌నినో ఎఫెక్ట్ ప్రపంచవ్యాప్తంగా ఉందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. 2లో



కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు.. పచ్చి దోపిడీ: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, అక్టోబర్15: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి మండిపడ్డారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. పచ్చి దోపిడీ, లూటీ పాలన అంటూ అభివర్ణించారు. 2లో



ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు


ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి

కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలుపరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం

సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ

ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం

ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. 2లో



దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు

దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం

ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం

మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు

త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది.

పతకాలు కేవలం అంకెలు కావు.. భారత శక్తికి ప్రతీకలు: ప్రధాని మోదీ



స్పోర్ట్స్ డెస్క్: ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పతకాలు కేవలం అంకెలకు మాత్రమే పరిమితం కాదని, అది క్రీడా రంగంలో భారత దేశ శక్తికి ప్రతీకని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆసియా క్రీడలు 2026లో పతకాలు సాధించిన అథ్లెట్లను ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో ప్రధాని మోదీ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. దేశానికి కీర్తి తెచ్చిన అథ్లెట్లందరినీ అభినందిస్తూ.. ఈ విజయాలు మొత్తం 140 కోట్ల మంది దేశప్రజలందరివని మోదీ స్పష్టం చేశారు.'ఈ పతకాలు కేవలం సంఖ్యలు కావు. ఇవి ఒక నూతన భారతదేశ శక్తిని ప్రతిబింబిస్తాయి. ప్రపంచ వేదికలపై మన దేశ త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరవేయడమే అత్యున్నత విజయం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ క్రీడా వేడుకలో మహిళా అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కనబరిచారని ప్రశంసించారు. మహిళా అథ్లెట్లు ఏకంగా 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలను సాధించడం విశేషమని ప్రశంసించారు. అలాగే క్రికెట్, హాకీ జట్లతో పాటు ఐదు స్వర్ణ పతకాలు గెలుచుకున్న ఆర్చరీ క్రీడాకారుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు.

యువ అథ్లెట్లు ప్రధానికి తమ సంతకం చేసిన జెర్సీలు, 17 ఏళ్ల ఆర్చరీ క్రీడాకారిణి కుంకుమ్ మోహోద్ విల్లును జ్ఞాపికగా బహుకరించారు. దేశ క్రీడా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టిస్తున్న ఈ విజేతలు రాబోయే రోజుల్లో అంతర్జాతీయ వేదికలపై మరింతగా రాణించి దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. జపాన్ వేదికగా జరిగిన ఆసియా క్రీడలు 2026 టోర్నీలో 21 స్వర్ణాలతో సహా మొత్తం 85 పతకాలను సాధించి భారత్ అసాధారణ ప్రదర్శన కనబరిచింది.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో తొలి దశ పూర్తి ప్రస్తుతం ఒప్పందం లీగల్ డ్రాఫ్టింగ్ దశలో ఉందన్న కేంద్ర మంత్రి చర్చలు కొలిక్కి వస్తున్నాయన్న విదేశాంగ మంత్రి జైశంకర్ పోటీ దేశాలపై పైచేయి సాధించడమే లక్ష్యమంటున్న భారత్

భారత్-అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పురోగతి లభించింది. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌లో మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం ఇది న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్టింగ్) దశలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు.

"అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి విడత చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రస్తుతం దీనికి తుది మెరుగులు దిద్దుతున్నాం. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత, మన పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా ఈ ఒప్పందాన్ని అమలు చేస్తాం" అని పీయూష్ గోయల్ వివరించారు.

ఇదే విషయంపై వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, చర్చలు సానుకూల దిశలో సాగుతున్నాయని, వీలైనంత త్వరగా ఒప్పందం కొలిక్కి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో టారిఫ్ విధానంపై మరింత స్పష్టత వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు.విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఒప్పందంపై ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు తుది దశకు (ల్యాండింగ్ పాయింట్) చేరుకుంటున్నాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు దక్కే అదనపు ప్రయోజనాలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.అయితే, అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ ఇటీవల మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరు దేశాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, ఇది వెంటనే కార్యరూపం దాల్చే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ఇంకా పరిష్కారం కాని కొన్ని అంశాలపై ఇరు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.

టారిఫ్ సమస్యలు, ఇతర అడ్డంకులను తొలగించి, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో 2025 ప్రారంభం నుంచి భారత్, అమెరికా మధ్య ఈ చర్చలు సాగుతున్నాయి. గతంలో అమెరికా విధించిన సుంకాలు, హెచ్1బీ వీసా ఫీజుల పెంపు, గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్‌పై ఆంక్షల వంటి పరిణామాలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపిన నేపథ్యంలో, తాజా పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు

దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం

ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం

మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు

త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 4 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించేందుకు, ఇప్పటికే నడుస్తున్న 3 రైళ్లను పొడిగించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వీటితో పాటు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్లను కేటాయించింది.ఈ మార్పులకు సంబంధించిన రైళ్ల ప్రారంభ తేదీలు, పొడిగింపు తేదీలను సంబంధిత రైల్వే జోన్లు త్వరలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా వెల్లడిస్తాయని అధికారులు తెలిపారు.

ఎల్‌నినో కోవిడ్ లాంటి సంక్షోభం.. రైతులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్ రెడ్డి

అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. 100 దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉందని ఐక్యరాజ్య సమితి వెల్లడించిందని గుర్తు చేశారు. దీనివల్ల తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొందని చెప్పారు. అన్ని జీవరాశులపై ఈ ఎల్‌నినో ప్రభావం ఉందని పేర్కొన్నారు.

ఎల్‌నినో ఓ ప్రకృతి విపత్తు..

కోవిడ్ లాంటి సంక్షోభం ఎల్‌నినో అని అభివర్ణించారు. ఈ 75 ఏళ్లలో చాలా సార్లు ఎల్‌నినో వచ్చిందని వివరించారు. ఎల్‌నినో ఓ ప్రకృతి విపత్తు అని అన్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తూనే ఈ విపత్తును ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రజలతోపాటు రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. గ్లోబల్ వార్మింగ్ వల్లే ఎల్‌నినో విపత్తు వచ్చిందని విశదీకరించారు.

చేయిదాటనున్న పరిస్థితులు..

ఎల్‌నినో విషయంలో శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారని తెలంగాణ సీఎం గుర్తు చేశారు. ఎల్‌నినో వల్ల చేయిదాటే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావంపై రైతులను ముందే హెచ్చరించామని పేర్కొన్నారు. ఈ ఎల్‌నినోను ఎదుర్కోవడానికి కార్యాచరణ చేపట్టామని అన్నారు. అలాగే రైతులను ఆదుకునేందుకు చర్యలు కూడా చేపట్టామని వివరించారు.వేసవి తరహాలో అధిక ఉష్ణోగ్రతలు..

ఎండల తీవ్రత బాగా పెరిగిందని చెప్పారు. వేసవి తరహాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు. విద్యుత్‌తో పాటు నీటి అవసరాలు కూడా పెరుగుతున్నాయని వివరించారు. అయినా డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తూ.. రైతులు, పరిశ్రమలకు సరఫరా చేస్తోందని అన్నారు.

ఓ సీజన్ పంట వాయిదా వేసుకోవాలి..

ఎండాకాలం పంటలు వేయడం మానుకోవాలని రైతులకు సీఎం రేవంత్ సూచించారు. ఒక సీజన్ పంటను వాయిదా వేసుకోవాలని వారికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఎవరో చెప్పిన మాటలను నమ్మొద్దంటూ రైతులకు స్పష్టం చేశారు. రైతులతోపాటు రైతు కూలీలకూ కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకున్నాయని వివరించారు. రైతు కూలీలను ఉపాధి హామీ పని ద్వారా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉపాధి కూలీల ద్వారా చెరువులు, కుంటలను వచ్చే వర్షాకాలానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకాలతో ఎల్‌నినో విపత్తును ఎదుర్కొందామని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

పైశాచిక ఆనందం పొందుతున్న కొందరు..

రాష్ట్ర పరిస్థితిని చూసి కొందరు పైశాచిక ఆనందం పొందుతున్నారంటూ ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశించి సీఎం రేవంత్ విమర్శించారు. ఎల్‌నినో పరిస్థితులపై అఖిలపక్షంతో సబ్ కమిటీ చర్చలు జరుపుతుందని తెలిపారు. త్వరలో కేంద్రానికి నివేదికలు అందించి.. సాయం కోరుతామని అన్నారు. అవసరమైన విద్యుత్ కొనుగోలుకు సాయం చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని ఆయన కోరారు. కేంద్రం నుంచి విద్యుత్ కొనుగోలుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విపత్కర పరిస్థితుల్లో కేంద్రాన్ని సాయం కోరుతున్నామని చెప్పారు.

పార్టీలు, పౌరులు ప్రభుత్వానికి సహకరించాలికోవిడ్ సమయంలో తాము రాజకీయాలు చేయలేదని వివరించారు. ప్రధాని ఇచ్చిన ప్రతి పిలుపును అమలు చేశామని గుర్తు చేశారు. వ్యాక్సిన్ వచ్చే వరకు కోవిడ్ విషయంలో జాగ్రత్త పాటించామని తెలిపారు. కోవిడ్ నాటి స్ఫూర్తినే ఇప్పుడు రాజకీయ పార్టీలు చూపాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలు, పౌరులు ప్రభుత్వానికి సహకరించాల్సిన సమయమిదని పేర్కొన్నారు. ప్రకృతి విపత్తును అందరం కలిసి ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సాగునీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నోరు లేని మూగ జీవాలను కాపాడుకోవాలని సూచించారు.

దసరా తర్వాత అఖిల పక్ష చర్చలు..

చలికాలంలోనే ఎండాకాలాన్ని మించిన వేడి కనిపిస్తోందని సీఎం రేవంత్ తెలిపారు. సాగు, తాగునీటితోపాటు విద్యుత్ విషయంలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. నాడు కాంగ్రెస్ పార్టీ జై జవాన్.. జై కిసాన్ నినాదం తీసుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రైతులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. దసరా తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్షంతో చర్చలు ఉంటాయని స్పష్టం చేశారు.

కేంద్రంలోని పెద్దలను కలుస్తాం..

అఖిలపక్షం తర్వాత కేంద్రంలోని పెద్దలను కలుస్తామని పేర్కొన్నారు. ఎల్‌నినోపై నిరంతరం చర్చలకు భట్టి నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ నియమించినట్లు చెప్పారు. ఏ రోజుకారోజు వివరాలు తెలిపేందుకు నోడల్ అధికారిని నియమిస్తామని ప్రకటించారు. ఎల్‌నినోపై నోడల్ ఆఫీసర్‌గా మాజీ సీఎస్ కె. రామకృష్ణారావు నియమించినట్లు వెల్లడించారు. నోడల్ ఆఫీసర్ ఇచ్చిందే అధికారిక సమాచారంగా భావించాలని ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు

ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి

కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలువరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం

సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ

ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం

ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (శుక్రవారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది.దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి నిరాకరించింది.మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ పిలుపునిచ్చిన ఈ నిరసనలో తాము కూడా పాల్గొంటామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. నిరసనకారులు జాతీయ జెండాలతో తరలిరావాలని దీప్కే పిలుపునిచ్చారు.ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ ఎన్నికల సంఘానికి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రాంగణంలో మార్చ్ నిర్వహించడంపై దాఖలైన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసన నాటి సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు.. పచ్చి దోపిడీ: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, అక్టోబర్15: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి మండిపడ్డారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. పచ్చి దోపిడీ, లూటీ పాలన అంటూ అభివర్ణించారు. అనుచరులు, ఆప్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు నిబంధనల ఉల్లంఘనలు అని విమర్శించారు. అర్హతలు లేని వారికి కమీషన్ల కోసం పనులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయంలోనే ఆగడాలు ఏమిటని ప్రభుత్వాన్ని ఆమె సూటిగా ప్రశ్నించారు.

కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడేవారిని వదిలిపెట్టబోమని కవిత హెచ్చరించారు. తెలంగాణలోనూ మహిళా రైతుల సాధికారత చట్టం తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రైతులకు, రైతు కూలీలకు చట్టపరమైన గుర్తింపు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళా రైతులకు ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత తదితర ప్రయోజనాలు అందించాలని రేవంత్ ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు.

ఇరాన్‌పై అమెరికా 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' అసలు ఈ ఆయుధం ఎంత శక్తిమంతం

ఇరాన్‌పై తదుపరి సైనిక చర్యల విషయంలో అమెరికా భారీ సంప్రదాయ బాంబు 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' (ఎంఓఏబీ)ను ఉపయోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సీఎన్ఎన్ కథనం వెల్లడించింది. ఇరాన్‌లోని భూగర్భ అణు సంబంధిత కేంద్రాలే లక్ష్యంగా ఈ ఆయుధాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, భారీ పేలుడు సృష్టించగల ఈ బాంబు.. భూమి లోతుల్లో, గ్రానైట్ వంటి దృఢమైన పొరలతో రక్షణ కల్పించిన కేంద్రాలను ధ్వంసం చేయగలదా అన్నది సందేహాస్పదంగా మారింది.ఎంఓఏబీ పూర్తి పేరు 'జీబీయూ-43/బీ మాసివ్ ఆర్డినెన్స్ ఎయిర్ బ్లాస్ట్'. అమెరికా ఆయుధాగారంలో ఉన్న అతిపెద్ద అణ్వస్త్రేతర సంప్రదాయ బాంబుల్లో ఇదొకటి. దీని బరువు సుమారు 9,800 కిలోలు. భూమికి సమీపంలో భారీ పేలుడు సృష్టించి, విశాలమైన ప్రాంతంలో ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. సుమారు తొమ్మిది నగర బ్లాకులకు సమానమైన ప్రాంతంపై ప్రభావం చూపగలదని అంచనా.భూగర్భంలో లోతుగా ఉన్న లక్ష్యాలను ఛేదించేందుకు రూపొందించిన బంకర్ బస్టర్ బాంబుల్లా ఎంఓఏబీ పనిచేయదు. ఇది భూమిలోకి చొచ్చుకెళ్లి పేలడం కంటే, గాలిలో లేదా భూమికి పైన పేలుడు సృష్టించి విశాల ప్రాంతంలో విధ్వంసం కలిగించేలా రూపొందించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తదుపరి సైనిక చర్యల కోసం భారీ దాడికి ప్రణాళికలను సిద్ధం చేయాలని సైన్యాన్ని ఆదేశించినట్లు సమాచారం. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు, అణు సంబంధిత లక్ష్యాలపై చర్యలు కూడా ఈ ప్రతిపాదనల్లో ఉన్నట్లు తెలుస్తోంది. విషయంలో వైట్‌హౌస్‌లోని కొందరు సలహాదారులకు సందేహాలు ఉన్నట్లు సీఎన్ఎన్ తెలిపింది.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కొత్త లింక్ లైన్.

చింతకాని, అక్టోబర్ 15 (ప్రజా వేదిక ప్రతినిధి):



రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు, విద్యుత్ సమస్యలను తగ్గించే లక్ష్యంతో మధిర డివిజనల్ ఇంజనీర్ (డీఈ) ఆధ్వర్యంలో పలు విద్యుత్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా రామకృష్ణాపురం, కోడుమూరు, లచ్చగూడెం, నేరెడ, కోమట్లగూడెం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికలను ప్రారంభించారు. అలాగే రేపల్లెవాడ--ప్రొద్దుటూరు గ్రామాల మధ్య నూతనంగా ఏర్పాటు చేసిన 2.4 కిలోమీటర్ల 11 కేవీ లింక్ లైన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మధిర డివిజనల్ ఇంజనీర్ బి. శ్రీనివాసరావు, బోనకల్ ఏడీఈ వై.వి. ఆనంద్ కుమార్‌లు వివిధ గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, రాబోయే రోజుల్లో తలెత్తే నీటి ఎద్దడి సమస్యలపై చర్చించారు.విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులపై వారి అభిప్రాయాలను సేకరించారు.కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికలు, 11 కేవీ లింక్ లైన్ ద్వారా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చింతకాని విద్యుత్ శాఖ ఏఈ శ్రీధర్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేశానికి కలాం సేవలు మరువలేనివి.



-సూరం సుధాకర్ రెడ్డి.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,అక్టోబర్ 15.

భారత దేశ మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్, 'యువత రోల్ మోడల్' డాక్టర్ ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని బయ్యారం కాంగ్రెస్ నాయకులు సూరం సుధాకర్ రెడ్డి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా సూరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి,దేశ అత్యున్నత పదవిని అలంకరించిన అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.శాస్త్రవేత్తగా దేశ రక్షణ రంగానికి ఆయన అందించిన సేవలు, భారతదేశాన్ని అణు శక్తి రంగంలో అగ్రగామిగా నిలపడంలో ఆయన పాత్ర మరువలేనివని కొనియాడారు.?"కలాం కేవలం ఒక రాష్ట్రపతి మాత్రమే కాదు, కోట్లాది మంది యువత హృదయాల్లో నిలిచిన గొప్ప మార్గదర్శి.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని,దేశాభివృద్ధికి పాటుపడటమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి" అని సుధాకర్ రెడ్డి అన్నారు.దేశ భవిష్యత్తు తరాలు ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు.

వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు: ఎంఏఓ సతీష్!

చింతకాని : అక్టోబర్ 15: ప్రజా వేదిక ప్రతినిధి.



ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటి తీవ్ర నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున, రాబోయే సీజన్‌లో రైతులు వరి సాగును మానుకుని ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని చింతకాని మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) పి. సతీష్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో రైతులతో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ.. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో వరి వేయడం వల్ల పంట నష్టంతో పాటు భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు తక్కువ నీటితో పండే పెసర, మినుము, జొన్న, సజ్జ, రాగులు వంటి చిరుధాన్యాలు, అపరాల పంటలను సాగు చేయాలని సూచించారు. వీటి ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని, భూమి సారం కూడా పెరుగుతుందని వివరించారు.అనంతరం గ్రామంలో ఎన్ఎమ్ఎన్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) పథకం కింద బిఆర్‌సి ద్వారా పూర్తి సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్న క్యాప్సికం తోటను ఎంఏఓ పరిశీలించారు. రసాయన పురుగు మందులు వాడకుండా సోలార్ లైట్ ట్రాప్‌లు, జిగురు అట్టలు, జీవన ఎరువులతో శాస్త్రీయ పద్ధతిలో పంట పండిస్తున్న తీరును పరిశీలించి, సదరు రైతును ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆధునిక ప్రకృతి వ్యవసాయ క్షేత్రం మిగతా రైతులకు ఎంతో ఆదర్శంగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కొప్పుల రజిని, మండల ఏఈఓలు బి. కార్తీక్, ఎస్‌కే ఆయేషా ఫాతిమా, బిఆర్‌సి సిబ్బంది మరియు సుమారు 30 మంది రైతులు పాల్గొన్నారు.

చింతకాని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షురాలిగా

జొన్నలగడ్డ మల్లీశ్వరి, కార్యదర్శిగా గుడిది పిచ్చయ్య ఏకగ్రీవ ఎన్నిక!

చింతకాని : అక్టోబర్ 15: ప్రజా వేదిక ప్రతినిధి





ఖమ్మం జిల్లా చింతకాని మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షురాలిగా జొన్నలగడ్డ మల్లీశ్వరి (మనం న్యూస్), ప్రధాన కార్యదర్శిగా గుడిది పిచ్చయ్య (సి.కె. న్యూస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా గడ్డం విజయ్ (ప్రజా దర్బార్), శెట్టి సురేష్ (సందేశం టైమ్స్), గండారపు రామారావు (సంచలన వార్త), గంటల తిరుపతాచారి (మెట్రో ఉదయం), వేర్పుల కోటేశ్వరరావు (పయనించే సూర్యుడు), చాపలమడుగు మంగతాయి (ప్రజా వేదిక)లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు పాత్రికేయులు, నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి నూతన కమిటీ కృషి చేయాలని, ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య నిరంతరం వారధిగా నిలవాలని ఆకాంక్షించారు.

బొప్పారంలో వేడుకగా నందిని నిశ్చితార్థం.. నూతన జంటను ఆశీర్వదించిన సర్పంచులు!

చింతకాని, అక్టోబర్ 15 (ప్రజా వేదిక ప్రతినిధి):



ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని బొప్పారం గ్రామంలో వేడుకల సందడి నెలకొంది. బొప్పారానికి చెందిన ఆత్మకూరు సైదులు--సంధ్య దంపతుల కుమార్తె లినందినిలి, ఉషా రావుల నిశ్చితార్థ వేడుక బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అత్యంత ఘనంగా, కన్నులపండువగా జరిగింది.స్థానికంగా ఉన్న వారి నివాసంలో ఈ శుభకార్యం నిర్వహించారు. ఈ వేడుకకు గ్రామస్తులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సందడి చేశారు.ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా బొప్పారం గ్రామ సర్పంచ్ లిషేక్ రహమతుల్లా, తిరుమలాపురం గ్రామ సర్పంచ్ లిలిచాపలమడుగు వీరబాబులి విచ్చేశారు. నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న నందిని - ఉషా రావులను ఆపూర్వంగా అభినందించి, ఘనంగా ఆశీర్వదించారు.గ్రామ పెద్దలు, ఇరు కుటుంబాల ఆశీస్సులతో జరిగిన ఈ నిశ్చితార్థ వేడుకతో బొప్పారంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సంతోషకరమైన సందర్భంలో నూతన జంటకు అందరూ శుభాకాంక్షలు తెలిపారు.

సేవా కార్యక్రమాలతో నరేష్ రెడ్డి జన్మదిన వేడుకలు....

తిరుమలాయపాలెం అక్టోబర్ 15
(ప్రజా వేదిక) న్యూస్
ప్రతినిధి కూరపాటి ఉపేందర్





తిరుమలాయపాలెం: కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని తిరుమలాయపాలెం మండల కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో తమ అభిమానాన్ని చాటుకోవడంతో పాటు, తిరుమలాయపాలెం వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.

నరేష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొని బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకుడిపై తమకున్న అభిమానాన్ని నినాదాలు, ర్యాలీ ద్వారా వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రికి చేరుకొని రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ..

"జన్మదిన వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, నలుగురికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడమే నిజమైన ఆనందం. ప్రజల మధ్య ఉంటూ, ప్రజల కోసం పనిచేసే నాయకులకు ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి" అని పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం.... సేవే లక్ష్యంగా ముందడుగు!

జన్మదిన వేడుకల్లో భాగంగా శుభలేఖలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు."రక్తదానం ఒకరి జీవితంలో వెలుగులు నింపే మహత్తరమైన దానం. మనం చేసే చిన్న సహాయం మరొకరికి పునర్జన్మను ప్రసాదించవచ్చు" అనే సందేశంతో సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చారు.

నాయకుడి జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీ, రోగులకు పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం వంటి కార్యక్రమాలు అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఆడంబరాలకు మాత్రమే పరిమితం కాకుండా, సేవా కార్యక్రమాల ద్వారా జన్మదిన వేడుకలకు సార్థకత చేకూర్చడం అభినందనీయమనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ సంగబత్తుల స్వాతి సుమన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్ నాయక్ సర్పంచులు మోర అనిల్ రెడ్డి వనవాసం నరేందర్ రెడ్డి గుమ్మడి దేవబిక్షం నందిపాటి మల్లికార్జున్ అన్నెపర్తి రవి గండు చంద్రయ్య మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంద్యాల శ్యాంసుందర్ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్ కట్కూరి శ్రీనివాస్ రెడ్డి కొప్పుల రామ్ రెడ్డి మోరపాక నాగయ్య ఓరా వెంకటేశ్వర్లు మెట్టు అనిల్ కుమార్ గుగులోత్ బద్రునాయక్ షేక్ షకీల్ పాషా నల్లబెల్లి లింగయ్య గోళ్ళ లింగయ్య తదితరులు పాల్గొన్నారు

కొమరం భీమ్ కాలనీలో కొత్త వెలుగులు.. కాలనీ రూపురేఖలు మార్చిన సర్పంచ్.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,అక్టోబర్ 15.



దాదాపు 60 సంవత్సరాలుగా విద్యుత్ వెలుగులకు నోచుకోక నిరాదరణకు గురైన కొత్తపేట పంచాయతీ పరిధిలోని కొమరం భీమ్ కాలనీలో ఇప్పుడు అభివృద్ధి వెలుగులు వికసించాయి.ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ కాలనీ రూపురేఖలను పూర్తిగా మార్చేశారు.కాలనీ వాసుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'జ్వాలా' పథకం కింద ప్రత్యేక చొరవ తీసుకుని 14 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించి,వీధిలైట్లను వెలిగించారు. దీంతో దశాబ్దాల చీకట్లు తొలగిపోయి కాలనీ అంతా విద్యుత్ కాంతులతో జిగేల్మంటోంది.కేవలం విద్యుద్దీకరణే కాకుండా,కాలనీలో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు సర్పంచ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పంచాయతీ నిధులతో బీటీ రోడ్డును, అలాగే ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో సీసీ రోడ్డును నిర్మించి రవాణా కష్టాలను దూరం చేశారు.తాము ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ కాలనీని అభివృద్ధే లక్ష్యంగా ముందుకు తీసుకెళ్తున్న సర్పంచ్ ప్రవీణ్ నాయక్ పనితీరుపై కొమరం భీమ్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావి వీరభద్రరావు, 9వ వార్డు సభ్యులు ఈసం స్వరూప, వడ్లమూడి కోటేశ్వరరావు, పెండ్యాల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు మెస్సు రాజేష్, వట్టం వెంకటేష్, మెస్సు సురేష్, దనసరి వీరభద్రం, యూత్ అధ్యక్షులు ఉదయ్, ఈసం రామ్మూర్తి, పుల్లూరు బాలరాజు, వంగురు ఆనంద్, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'.. తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన



ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం
17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం
2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం
ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో, 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది.

పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు వంటి కీలక రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 2027 జనవరి 4న తుది జాబితాను విడుదల చేస్తారు. కాగా, 2027 ఫిబ్రవరి నాటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది.

వివాదానికి దారితీసిన సర్

'సర్' ప్రక్రియలో భాగంగా భారీస్థాయిలో ఓటర్ల పేర్లను తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, ఫారం-6తో పాటు ఓటర్లు ఒక అదనపు డిక్లరేషన్ సమర్పించాలన్న నిబంధన వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం జరిగిన 'సర్' వివరాలతో ప్రస్తుత దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వివరాలను అనుసంధానం చేయాలని కోరడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో 'ఇండియా' కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువజన సంఘాలు ఢిల్లీలో నిరసనలు చేపట్టాయి. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఏపీ, తెలంగాణలో పరిస్థితి ఏంటి?

ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతున్న లేదా ఇటీవలే పూర్తయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 'ఎస్ఎస్ఆర్' షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదేవిధంగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకు 'సర్' ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో కూడా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో వెల్లడిస్తామని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 29న ఇచ్చిన ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్రాల అధికారులకు సూచించినట్లు ఈసీ గుర్తు చేసింది.

మండల పరిషత్ ఆవరణలో ఉన్నటేకు చెట్లను నరికిన ముఠా పై సమగ్ర విచారణ జరపాలి

బీఆర్ఎస్ నేతలు కట్టా అజయ్ బాబు, కౌన్సిలర్ లక్కినేని రఘు డిమాండ్

కల్లూరు అక్టోబర్ 15 : ప్రజా వేదిక

కల్లూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో 10 టేకు చెట్ల నరికివేత ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వారందరిపైనా కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో నరికివేసిన టేకు చెట్లను పరిశీలించి, తిరిగి పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యులు కట్టా అజయ్ కుమార్, డాక్టర్ లక్కినేని రఘు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోనే టేకు చెట్లు నరికివేతకు గురికావడం ఆందోళనకరమన్నారు. ఈ ఘటన వెనుక ఎవరెవరి ప్రమేయం ఉందో వెలికితీయాలని డిమాండ్



చేశారు. కేవలం ఇద్దరిపై మాత్రమే అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేయడం సరిపోదని, చెట్ల నరికివేత నుంచి కలప తరలింపు వరకు ఇందులో భాగస్వాములైన వారందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నరికివేసిన 10 టేకు చెట్ల విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు. చెట్ల నరికివేత, కలప తరలింపులో ట్రాక్టర్‌పై ఉన్నవారితో పాటు ఇతరుల పాత్రను కూడా విచారించాలని సూచించారు. ప్రభుత్వ అండదండలు లేకుండా ఇలాంటి ఘటన జరిగే అవకాశం లేదని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పుర కౌన్సిలర్లు పెడకంటి రామకృష్ణ, కనపర్తి శ్యామల రాజ్ కుమార్, ఇస్మాయిల్, దార్ల రమేష్, ఇంతియాజ్, పెద్ద బోయిన నాగమల్లేశ్వరరావు, పుసులూరి శ్రీనివాసరావు, మేకల కృష్ణ, షేక్ కమ్లి, అంజన్ రావు, రావి సూర్యనారాయణ,కృష్ణ, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బయ్యారంలో వైభవంగా శాకంబరి దేవి అలంకరణ..

-108 రకాల నైవేద్యాల సమర్పణ.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,అక్టోబర్ 15:

బయ్యారం మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి దేవాలయంలో దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అమ్మవారు రోజుకో ప్రత్యేక రూపంలో భక్తులకు దర్శనమిస్తూ భక్తిశ్రద్ధలను పెంపొందిస్తున్నారు.ఇందులో భాగంగా గురువారం నవరాత్రుల ఉత్సవాలలో ఐదవ రోజు అమ్మవారు సర్వజన సమ్మోహనకరమైన శ్రీ శాకంబరి దేవి అవతారంలో భక్తులకు దివ్యదర్శనం ప్రసాదించారు.ప్రకృతికి, శ్రీపంటలకు, జీవరాశికి అధిదేవతగా భావించే శాకంబరి దేవిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు సుదర్శనాచార్యులు అమ్మవారిని వివిధ రకాల తాజా కూరగాయలు, ఆకుకూరలతో అత్యంత మనోహరంగా, కన్నుల పండువగా అలంకరించారు. రకరకాల వర్ణాల కూరగాయలతో కూడిన ఈ అలంకరణ బయ్యారం ఆలయ ప్రత్యేకతను చాటుతూ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

108 రకాల నైవేద్యాల నివేదన.



శాకంబరి దేవికి ఎంతో ప్రీతిపాత్రమైన రీతిలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 108 రకాల నైవేద్యాలను అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. వివిధ రకాల పిండి వంటలు, ఫలహారాలు, శాకాహార వంటకాలతో కూడిన ఈ మహా నైవేద్య నివేదన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. అమ్మవారికి సమర్పించిన ఈ వైవిధ్యభూరితమైన నైవేద్యాలు భక్తులకు కనువిందు చేశాయి.

ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలలో బయ్యారం మండల కేంద్రంలోని భక్తులు అధిక సంఖ్యలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి కృపతో పాడిపంటలు సమృద్ధిగా వర్ధిల్లాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకలను దిగ్విజయవంతం చేయడంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కార్యక్రమం ముగింపులో భక్తులకు భారీ ఎత్తున ప్రసాద వితరణ చేపట్టారు.

మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



'మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు బతుకమ్మ వేడుకలు.

అక్టోబర్ 15న్యూస్/

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో, మహిళా కాంగ్రెస్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఇరాన్‌పై అమెరికా 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' అసలు ఈ ఆయుధం ఎంత శక్తిమంతం?

ఎంఓఏబీ బరువు సుమారు 9,800 కిలోలు
అమెరికా వద్ద ఉన్న అతిపెద్ద సంప్రదాయ బాంబుల్లో ఇదొకటి
పికాక్స్ మౌంటైన్ భూగర్భ కేంద్రం లక్ష్యంగా ఉండొచ్చని సమాచారం
లోతైన భూగర్భ నిర్మాణాలను ఛేదించే సామర్థ్యంపై సందేహాలు
2017లో ఆఫ్ఘనిస్థాన్‌లో తొలిసారి యుద్ధంలో ప్రయోగం

ఇరాన్‌పై తదుపరి సైనిక చర్యల విషయంలో అమెరికా భారీ సంప్రదాయ బాంబు 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' (ఎంఓఏబీ)ను ఉపయోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సీఎన్ఎన్ కథనం వెల్లడించింది. ఇరాన్‌లోని భూగర్భ అణు సంబంధిత కేంద్రాలే లక్ష్యంగా ఈ ఆయుధాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, భారీ పేలుడు సృష్టించగల ఈ బాంబు.. భూమి లోతుల్లో, గ్రానైట్ వంటి దృఢమైన పొరలతో రక్షణ కల్పించిన కేంద్రాలను ధ్వంసం చేయగలదా అన్నది సందేహాస్పదంగా మారింది.ఎంఓఏబీ పూర్తి పేరు 'జీబీయూ-43/బీ మాసివ్ ఆర్డినెన్స్ ఎయిర్ బ్లాస్ట్'. అమెరికా ఆయుధాగారంలో ఉన్న అతిపెద్ద అణ్వాస్త్రేతర సంప్రదాయ బాంబుల్లో ఇదొకటి. దీని బరువు సుమారు 9,800 కిలోలు. భూమికి సమీపంలో భారీ పేలుడు సృష్టించి, విశాలమైన ప్రాంతంలో ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేయడం దీని ప్రధాన



ఉద్దేశం. సుమారు తొమ్మిది నగర బ్లాకులకు సమానమైన ప్రాంతంపై ప్రభావం చూపగలదని అంచనా.భూగర్భంలో లోతుగా ఉన్న లక్ష్యాలను ఛేదించేందుకు రూపొందించిన బంకర్ బస్టర్ బాంబుల్లా ఎంఓఏబీ పనిచేయదు. ఇది భూమిలోకి చొచ్చుకెళ్లి పేలడం కంటే, గాలిలో లేదా భూమికి పైన పేలుడు సృష్టించి విశాల ప్రాంతంలో విధ్వంసం కలిగించేలా రూపొందించారు. ఇరాక్ యుద్ధ సమయంలో అభివృద్ధి చేసిన ఈ ఆయుధాన్ని అమెరికా తొలిసారిగా 2017 ఏప్రిల్‌లో ఆఫ్ఘనిస్థాన్‌లో ఐఎస్ ఉగ్రవాదుల సొరంగాల సముదాయంపై ప్రయోగించింది.

ఇరాన్‌లోని పికాక్స్ మౌంటైన్ వద్ద ఉన్నట్లు అనుమానిస్తున్న భూగర్భ కేంద్రంపై దాడి చేసేందుకు ఈ బాంబును ఉపయోగించే అవకాశాన్ని అమెరికా సైనిక అధికారులు పరిశీలిస్తున్నట్లు సీఎన్ఎన్ పేర్కొంది. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన కీలక భాగాలను అక్కడ నిల్వ చేసినట్లు అమెరికా, ఇజ్రాయెల్ భావిస్తున్నాయి. అయితే, మందపాటి గ్రానైట్ పొరలు, ఇతర రక్షణ నిర్మాణాలతో భద్రపరిచిన కేంద్రాలను ఎంఓఏబీ ధ్వంసం చేయలేకపోవచ్చని సైనిక ప్రణాళికలపై అవగాహన ఉన్న వర్గాలు తెలిపాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తదుపరి సైనిక చర్యల కోసం భారీ దాడికి ప్రణాళికలను సిద్ధం చేయాలని సైన్యాన్ని ఆదేశించినట్లు సమాచారం. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు, అణు సంబంధిత లక్ష్యాలపై చర్యలు కూడా ఈ ప్రతిపాదనల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో, యుద్ధాన్ని ముగించేందుకు మార్గాలను అన్వేషిస్తున్న అమెరికా ప్రభుత్వంపై దేశీయంగా రాజకీయ ఒత్తిడి పెరుగుతోంది.నవంబర్ 3న అమెరికా మధ్యంతర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇరాన్‌తో యుద్ధం రాజకీయంగా కీలక అంశంగా మారింది. ఎన్నికలకు ముందు మళ్లీ దాడులు జరపబోమని ట్రంప్ బహిరంగంగా సంకేతాలిచ్చినప్పటికీ, ఆ నిర్ణయం కొనసాగుతుందా అనే విషయంలో వైట్‌హౌస్‌లోని కొందరు సలహాదారులకు సందేహాలు ఉన్నట్లు సీఎన్ఎన్ తెలిపింది.







ఘనంగా గంజికుంట్ల వీక్షిత్ మొదటి పుట్టినరోజు వేడుకలు



నేలకొండపల్లి అక్టోబర్ 15 ప్రజావేదిక న్యూస్: నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో ప్రజా వేదిక న్యూస్ ఎడిటర్ వ్యవస్థాపకులు గంజికుంట్ల వెంకన్న,మనవడు గంజికుంట వీక్షిత్, మొదటి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం వారి ఇంటి వద్ద జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.గంజికుంట వీక్షిత్,కి కేక్ కట్ చేయించి తినిపించారు. తల్లితండ్రులు గంజికుంట్ల ఉదయ్ కిషోర్, శృతి, మరియు తాత నాయనమ్మ గంజికుంట్ల వెంకన్న, వరలక్ష్మి, మరియు పెద్దమ్మ పెదనాన్న గంజికుంట్ల ఉపేందర్, ఉమా, గ్రామంలోని పెద్దలు యూత్ పిల్లలు ప్రముఖులు పాల్గొని బాబుని ఆశీర్వదించారు..